# పగిలిన పలకలు

అప్పుడే తెల్లవారింది. పట్నం శివారులోనున్న హరిజనవాడలో చాలా సందడిగా వుంది. పిల్లలందరూ అప్పటికప్పుడే, చిన్న చిన్న చింకి లాగులూ, వున్న వాటిలో కాస్త చిరుగులు తక్కువగావున్న చొక్కాలూ వేసుకుని బారులుతీరి అటూ ఇటూ కూర్చున్నారు. వాళ్ళకి కాస్త దూరంగా నిండా పచ్చని రెమ్మలతో విస్తరించివున్న వేపచెట్టు వుంది. ఆ చెట్టు చుట్టూరా పేడనీళ్ళతో చిక్కగా కళ్ళాపిచల్లి అందంగా ముగ్గులుపెట్టి వున్నాయి. మూడు కుర్చీల్లో మహాత్మాగాంధీ, జవహర్లాలు నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రీగార్ల ఫొటోలు వున్నాయి. ఆ ఫొటోలకి చిలకమందారపూలు, బంతిపూలుతో కట్టిన దండలువేసి వున్నాయి. ఒక్కొక్క కుర్చీలో నాలుగేసి కొవ్వొత్తులు వెలుగుతున్నాయి.

పిల్లలందరూ వాళ్ళల్లోవాళ్ళు మాట్లాడుకుంటూ గుసగుసలాడుతున్నారు. లారీ అంత ఎత్తుగా మేటవేసివున్న ఇసుకదిబ్బలమీంచి కొద్దిగా తలఎత్తి చూస్తున్నాడు సూర్యుడు.

వెంకయ్య ఇవ్వాళ చాలా హుషారుగా వున్నాడు. ఏమంటే వాడు నిన్న చాలా శ్రమపడి పెద్ద ఘనకార్యం సాధించాడు. వాడికి పన్నెండేళ్ళు వుంటాయి. వాడికి నలుగురు తమ్ముళ్ళున్నారు. ఎల్లమ్మ భర్త యుద్ధంలోకి పారి

పోయేడు. అప్పుడప్పుడూ అయిదూ పదీ పంపుతూ ఉంటాడు. ఎల్లమ్మ రోడ్డుమీద పేడ ఏరి పిడకలుచేసి అమ్ముకుని బ్రతుకుతూ ఉంటుంది. వ్యవసాయపనులున్నరోజుల్లో ఆ పన్లు చేసుకుంటుంది. ఆ హరిజనవాడలో మూడువంతులు మనుషులు వ్యవసాయ కూలీలే ! కూలీ దొరికితే మస్తుగా తాగి తందనా లాడుతారు. లేనినాడు పస్తులు పడుకుంటారు. రేపటికిది దాచుకోవాలి, అన్న విచక్షణ ఉండదు. రోజులో అయిదారు కుటుంబాలవాళ్ళు ఏదో వంకన పోట్లాడుకుంటూ, తన్నుకుంటూ, ఏడ్చుకుంటూ ఉంటారు.

ఆ వాడకి కాస్త ఎగువగా, అయిదారు రాటల మీద వేసిన తాటాకుపాకవుంది. అది, ఆ వాడకి ఎలిమెంటరీ స్కూలు ! దానిలో కేశవరావు మాష్టరు. అసలు స్కూలుకి వున్న మాష్టరు అతను ఒక్కడే ! నిన్న స్కూలు వదిలేయటాని కింకా, అరగంట టయిమ్ వుందనగా, ఇద్దరు పెద్దమనుషులువొచ్చి, కేశవరావుతో ఏదో చెప్పారు. "సరే సరే" అంటూ కేశవరావు స్కూల్లోని పిల్లల పేర్లన్నీ వరస వరసనా అడిగి తెల్లకాగితంమీద ఎక్కించటం మొదలుపెట్టాడు.

"వెంకయ్య" అడిగాడు. "దేనికండీ మాష్టారూ, పేర్లన్నీ ఎక్కిస్తున్నారు !"

"రేపు మహాత్మాగాంధీ పుట్టినరోజు. అందుకని చదువుకునే పిల్లలందరికీ రేపు పలకలు, బలపాలూ పంచిపెడ్తారుట. అందుకని మన బళ్ళో చదివే పిల్లలందరి పేర్లూ వ్రాస్తున్నాను" అన్నాడు కేశవరావు.

పిల్లలంతా ఒక్కుమ్మడిగా లేచి, కేశవరావుని చుట్టు ముట్టారు "మా చెల్లి పేరెయ్యండి అంటే మా తమ్ముడి పేరేపిచ్చండి !" అంటూ గోలచేయసాగేరు.

ఈ సందట్లో వెంకయ్య పరిగెట్టి తల్లి వద్దకు వొచ్చేడు. ఎల్లమ్మ అప్పుడే ఎండిన పిడకలన్నీ పోగుచేసి, తట్టలోనికి పేర్చుతోంది. వగర్చుతూ వచ్చిన కొడుకుని చూసి "అప్పుడే ఇస్కూలు ఇడిసిపెట్టేరా ! ఈ పిడకలు, కరణంగోరి చెల్లెమ్మ రాంబాయమ్మ ఇంటికాడ ఏసిరా ! ఆ యమ్మ పైసలిస్తాది. అవట్టుగెళ్ళి పదిపైసాలు ఎండురొయ్యలు, పదిపైసాలు వర్ర పట్టుగురా !" అంది వెంకమ్మ.

"పోవోస్ ! అది కాదోలమ్మ రేపు మనీధికి ఎవురో గొప్పోళ్ళు వత్తరంట ! పిల్లలకి పలకలు, పుస్తకాలు పంచి పెడతారంట ! మరిగంటే మా పంతులు, పిల్లలందరి పేర్లూ రాత్తన్నాడు. మన తమ్ముళ్ళ పేర్లుకూడా రాయిత్తాను. ఆళ్ళ పేర్లేంటో బేగీ సెప్పు !" అన్నాడు.

ఎల్లమ్మ కాస్సేపు బుర్ర గోక్కుంది. "ఆళ్ళ పేర్లా ! పెద్దోడు గెందం అమాసకి పుట్టేడ్రా ! గెందమయ్య అందాంలే ఆడ్ని ! రెండోవాడు బక్కోడు ! మూడోవాడు నాగేంద్రుడే ! ఆఖరోడు సంటోడు ! ఒరే ! పలకలూ, పుస్తకాలేనా, ఇంకేమన్నా మిఠాయిలు గట్రా పంచుతార్రా !" ఆశగా అడిగింది.

"మరేమో ! నాకు పూర్తిగా తెల్దు !" అంటూనే స్తూలు వెంపు పరిగెట్టేడు !

కేశవరావు అప్పటికప్పుడే రెండొందల పేర్లు ఎక్కించేడు. ఇంకా మావాళ్ళ పేర్లెయ్యండి అంటే మావాళ్ళ పేర్లెయ్యండి ! అంటూ పిల్లలు సంతగోలగా అరుస్తూన్నారు. కేశవరావు అప్పటికే నాలుగుతావుల కాగితాలు పేర్లతో నింపేడు. కనుక విసుక్కుంటూ 'ఏమిటీ కాకిగోల ! పదండి' అని విదిలిస్తూ లేచి నిలబడ్డాడు. వెంకయ్య వగర్చుకుంటూ వచ్చి కేశవరావుని చుట్టేశాడు.

"మా తమ్ముళ్ళ పేర్లు ఏపిచ్చండి !" అన్నాడు గట్టిగా. వాడి గొంతులో విన్పించిన ధాష్టికానికి కేశవరావు అదిరి పోయేడు. అయినా ధీమాగా "నీ పేరు ముందే వేశానులే పో!" అన్నాడు కేశవరావు.

"నాదికాదు మా తమ్ముళ్ళది. పలకలూ, బలపాలూ ఆళ్ళకే కావాలి ! నాకున్నదిగా రోజూ రాసుకుండేది !" అన్నాడు.

"స్కూల్లో చదువుకునే వాళ్ళకే ఇస్తారు, అందరికీ ఇయ్యరు" అంటూ కేశవరావు పేర్లువ్రాసిన లిస్టు కాగితాన్ని ఒకసారి చూశాడు. ఆ ఎలిమెంటరీ స్కూల్లో అయిదు క్లాసులదాకా వున్నాయి. అయిదు క్లాసులకీ కలిపి నలభయి మంది పిల్లలు చదువుచున్నారు లిస్టులో వ్రాయబడ్డ బడి పిల్లల పేర్లు రెండువందలు దాటినాయి. అటెండన్సు రిజిష్టరులో నూటపాతిక మంది పిల్లల పేర్లున్నాయి. ఇంకెన్ని రాస్తాడు ?

ఆ కాగితాలు డ్రాయరులో పెట్టి తాళంవేశాడు. వెంకయ్య తల్లి దగ్గరికి వచ్చి భావురుమని ఏడుపు మొదలెట్టాడు.

"ఏరా ! మాష్ట్రు కొట్టాడా !" అంది ఎల్లమ్మ.

"అది కాదే అమ్మా ! మరిగంటే మన బుడ్డోళ్ళ పేర్లు ఏశాడు కాదు. గోపాయ తమ్ముళ్ళ పేర్లు పులిగాడి చెల్లెళ్ళ పేర్లు రాసినాడు." అన్నాడు.

"ఏమేటీ ! ఆళ్ళంత ఆడి తాతగారి చుట్టపోళ్లా, మావు కాకపోయామా ! ఈ బాపనోళ్ళకన్నీ ఇట్టాంటి బుద్ధులే ! అందుకే ఆళ్ళని దరిద్రం పట్టుకుని వొదలకుండా ఉంది." అంటూ గట్టిగా బిగించి నడినెత్తికి ఎత్తి పెట్టుకున్న జుట్టు ముడివిప్పి, చేతులు ఝాడించుకుంటూ స్కూలువైపు పరుగెత్తింది. స్కూలు తలుపు మూసివేసి రోడ్డు ఎక్కబోతున్న కేశవరావుని అటకాయించింది !

"ఏమయ్యోయ్ పంతులయ్యా ! నీకు మా సెడ్డగర్రా వొచ్చిపడ్డదే! దసరాపండగకి రూపాలూ, రెండురూపాలూ గుంజటానికి నీ అబ్బ సొమ్మేమన్నా దాచపెట్టావా ! నా పిల్లగాళ్ళు నీకు ఎక్కువ అయిపోయారా! ఆళ్ళందరూ, నీ అప్ప కొడుకులయినారా! మావోడు లబ్బున మొత్తుకొని వచ్చాడు గందా ! ఆడ్ని గసిరేశావంట !" అంటూ శివంగిలా వూగిపోతూ, పెద్ద పెట్టున కేకలేయసాగింది. దాని కేకలకి, ఆ వాడకట్టులోని జనం అంతా, క్రమక్రమంగా వాళ్ళ చుట్టూ చేరిపోయ్యేరు. కేశవరావు ఈ అల్లరికి బిక్కచచ్చి పోయేడు.

"లేదమ్మా. మిా వెంకట్రావు పేరు మొదల్నే రాశాను." అన్నాడు.

"ఆడిపేరు కాదయ్యోవ్ ? ఆడి తమ్ముళ్ళ పేరు. ఆళ్లు మా త్తరం రేపట్నించి చదువుకోరా ! ఎవరో మహాను భావుడు ఇస్తానంటే నీ కెందుకుబాధ !" అంది.

కేశవరావు ఎల్లమ్మతో వాదించలేక ఆ వాళ్ళ పేర్లు కూడా రాసి ఎల్లమ్మకి చదివి వినిపించేడు. దానితో వెంక య్యకి సింహాచలం కొండ ఎక్కినంత సంబరమయ్యింది ! వెంకయ్య తను లేస్తూనే తమ్ముళ్ళందర్నీ లేపేశాడు. ఏట్లోకి దిగి తను శుభ్రంగా వళ్ళు కడుగుకొన్నాడు. తమ్ముళ్ళకి కూడా కడిగాడు. వాడి ఇంటికంతటికీ రెండు చెడ్డీలు, వదు లుగా వ్రేలాడే పాతగళ్ళ బుష్‌కోటు ఉన్నాయి. తనొక చెడ్డీ కట్టుకుని, బుష్‌కోటు వేసుకున్నాడు. రెండో చెడ్డీని పెద్ద తమ్ముడికి కట్టాడు, మిగిలిన ముగ్గురికో !

"ఎవరో పెద్ద ఉజ్జోగస్తులే వస్తారంటా ! తమ్ముళ్ళని ఎట్టా తీసుకెళ్ళను!" అన్నాడు.

ఎల్లమ్మ తన చీరలో జానెడేసి వెడల్పు పీలికలు చింపి, వాళ్ళకు గోచీలు పెట్టింది. వెంకయ్య చంటాడ్ని ఎత్తుకుని మిగిలిన ముగ్గురునీ వెంటపెట్టుకుని, పిల్లలు కూర్చున్న వేప చెట్టు దగ్గరికి నడిచేడు.

పొరుగింటి పుల్లమ్మ పిల్లల కోడిలా బయలుదేరిన వెంకయ్యని చూసి "ఏందిరోయ్ ఎంకాయి ! నువ్వెత్తుకున్న సంటోడు ఎన్నోకళాసు సదూతున్నాడ్రా !" అంది ఎకక వక్కెంగా !

వెంకయ్య తక్కువ తిన్నదేం లేదు. "నీకెందుకే ఆ వులుకు ! నీ వెనోన్న కళాసు సదూతున్నావు ! ఒకటా రొండా !" అన్నాడు !

"ఆరి నీ జిమ్మడిపోనూ ! దుమ్మరగుండు ముఖం నువ్వూనూ ! తల్లిలాగానే ప్రతీ దానికీ కరవొస్తాడేం ! గుంట వెధవ !" అంటూ తిప్పుతుంది.

ఈలోగా ఖద్దరు చీరలు కట్టుకున్న పాతిక ముప్పయ్ మంది స్త్రీలూ. "జయ జయ భారత జాతిపిత, జయ జయ గాంధీ మహాత్మా. జయ జయ ప్రియ బాపూజీ" అని పాడు కుంటూ, వాడలోకి వొచ్చారు.

"ఇయ్యాలేందో ఈ గొడవ! ఇంకా తెల్లారిగంటన్న కాలేదు. అప్పుడే మూడోజట్టు ఈ వాడలోకి రాటం. ఏంట మ్మలూ ఎందుకల్లా తిరగతన్నారూ యీదులెంటా! ఇళ్ళ కాడ మీాకేం పన్లులేవా !" అందో ముసలిది.

ఆ జట్టులో కొంచెం లావుగా ఉన్నావిడ నిలబడింది. ఆమె పెద్ద సిగజుట్టుకుంది. కళ్ళజోడు, ఒక చేతికి ఖరీదైన వాచీ, ఒక చేతికి రెండుముత్యాల గాజులు వేసుకుంది. తెల్లగా ఉబ్బినట్లున్న బుగ్గల్తో ఎత్తయిన శరీరంతో హుందాగా ఉంది, ఆమె !

"ఈరోజు మహాత్మాగాంధీగారి పుట్టినరోజు ! ఆయన జీవితం అంతా మనదేశ ప్రజల సేవచేయటంకోసం ధారపోశారు. మురికివాడల్లో నివసించే పేదప్రజల అభి వృద్ధికి ఆయన ఎంతో పాటుపడ్డారు. మీారంతా ముందు పరిశుభ్రంగా వుండటం నేర్చుకోవాలి ! చెత్తాచెదారం,

మీా వాడకి దూరంగా పోగు పెట్టాలి. పిల్లల్ని శుభ్రంగా వుంచాలి. వాళ్ళకి చదువులు చెప్పించాలి. మీారు మీా వాడని శుభ్రంగా ఉంచుకుంటే అంటురోగాలురావు" అంటూ పరిశుభ్రత గురించి ఉపన్యసించ సాగింది.

ఆమె ఉపన్యాసం అలా అనర్గళంగా సాగుతోండ గానే ఇంకో ఇరుకు గల్లీలోనించీ కాంగ్రెసు జెండాలు పట్టు కున్న పాతిక మంది యువకులు వచ్చారు. వాళ్ళంతా ఖాదీ కోర్తా, పైజమాలూ, లాల్చీలూ, టోపీలూ ధరించారు. వాళ్లందరి చేతుల్లోనూ ఇనుపచేటలూ, కొబ్బరి ఈనెల చీపుళ్లూ వున్నాయి. కొంతమంది జండాలు పట్టుకోగా, కొంతమంది ఆ గల్లీల్లోలేని చెత్తను ఉన్నట్లుగా దుమ్ము ఎగజిమ్ముతూ బరుకూ బరుకూ తుడవసాగేరు. ఆ దుమ్మంతా అందరి కళ్లల్లోనూ, చెవుల్లోనూ పడసాగింది.

మహిళలజట్టు, ఆ యువక బృందంవైపు కొరకొరా చూస్తూ, ఇంకొక గల్లీలోంచి వెళ్లిపోయింది

పెద్ద బూరాలాంటిదాంట్లో గాంధీపాటలు పాడుతూ, ఇంకొకజట్టు కార్యకర్తలూ, వాళ్ల వెంట కేశవరావూ వొచ్చారు. కేశవరావుని చూడగానే, "మేస్త్రువచ్చిండు పంతులొచ్చిండు" అనుకుంటూ పిల్లలంతా గుసగున లాడుతూ కేశవరావుని చుట్టుముట్టారు.

కేశవరావు పిల్లలందర్నీ సర్ది వరసగా కూర్చోపెట్టి, తుడుస్తున్న కార్యకర్తలని పిలిచి, "ఈ గల్లీలన్నీ నిన్న సాయంకాలమే తుడిపించేశాను. పై వీధుల్లోకి వెళ్ళండి !"

అని చెప్పి పంపేశాడు. వాళ్ళంతా మళ్ళీ గాంధీగారి పాటలు పాడుకుంటూ వెళ్ళిపోయారు.

కేశవరావు వెంటనున్న పెద్దమనుష్యుల్లో ఇద్దరు, శాస్త్రీవు గాంధీమహాత్ముని బాల్యం గురించి ఆయన నిర్మాణ కార్యక్రమం గురించి, ఉపన్యాసం ఇచ్చేరు. అప్పటికే పొద్దు కరకరలాడుతూ, నడినెత్తికి వచ్చేసింది. రెండు రిక్షాలనిండా, పలకలు, బలపాలు, ఎక్కాల పుస్తకాలూ, నోట్సుపుస్తకాలూ తెచ్చారు.

కేశవరావు ఒక్కొక్క పేరే చదువుతూంటే ఒక్కొక్క పిల్లా, పిల్లవాడూ పలకా, బలపం పుస్తకాలు అందుకుని, ఇస్తూన్న కార్యకర్తలకి దండంపెట్టి వెళ్ళిపోతూ వున్నారు. ఇలా ఒక పాతికమంది పిల్లలుదాకా, క్రమాల పద్ధతిని వరసగా వచ్చేరు. ఒక పేరు పిలుస్తూంటే మూడేళ్ళ పిల్లని చంకనేసుకుని ఒక స్త్రీ వచ్చి పలక, బలపం పుచ్చుకుంది. ఇస్తూన్న కార్యకర్తలు కేశవరావు వెంపుచూసి "ఇదేమిటండీ మాస్టారూ. మరీ అన్యాయం! మూడేళ్ళ పాప కూడా చదువుకుంటోందా!" అన్నారు.

"లేదండీ, వాళ్ళక్క పేరు చదివాను. ఆ అమ్మాయికి జ్వరం వచ్చిందిట, అంచేత ఈవిడవొచ్చి తీసుకుంటోంది" అన్నాడు కేశవరావు.

క్రమక్రమంగా ఒకపేరు పిలుస్తూంటే నలుగురేసి రావటం మొదలెట్టారు. కార్యకర్తలు ఇచ్చేలోగానే "నాకండీ, నా కండీ" అంటూ చేతుల్లోవి లాక్కోవటం మొదలుపెట్టారు.

ఈ గోలలో వెంకయ్య లేచేడు. చేతుల్లోవున్న చంటాడ్ని, బక్కడకిచ్చేడు. అందరూ మేష్టారుదగ్గరికి వెళ్ళి ఎవళ్ళకి కావల్సినవి వాళ్ళు తీసుకుంటున్నారు. మేష్టారు ఎప్పటికి తన పేరు పిలవటమే లేదు. అసలు తన పేరు పిలవ్వొచ్చేప్పటికి ఆ పలకలన్నీ ఈ కుర్రగాంగు వుణ్ణివ్వదు! అనుకున్నాడు గుంపులో దూరేడు. పలకల దొంతరలోంచి చేతికందినన్ని పలకలు పుచ్చుకుని తమ గుడిసెలో అరుగు మీదపెట్టి వొచ్చేడు. మళ్ళీ కొన్ని నోటుపుస్తకాలు లాగేడు. పట్టుకు వెళ్ళి తల్లికిచ్చేడు.

ఎల్లమ్మ గుడిసె ముందున్న బండరాయిమీద పడుతూన్న ఎండలో కూచుంది. ఈ పూట ఆ ఇంట్లో వండుకుందికి ఏమీ లేవు. "అదేటో ఇయ్యాల పొద్దుటికాడనుండీ జనం ఒకటేగా ఇరగబడతన్నారు. యేవో మాటలు సెప్తన్నారు. శుభ్రంగా వుండాలంట! పిల్లల్ని శుభ్రంగా వుంచాలంట! మురికిగుడ్డలు కట్టకూడదంట! ఏటో మరి ఆళ్ళ ఉద్దేశం! అసలు కట్టుకుందికీ చలికి ఆగటానికి మురికివన్నా గుడ్డలుంటేగా, ఇస్త్రీలు గట్రా చేయటానికీ! తనకున్నది ఒకే ఒక కోక. అదన్నా అయిదు మూళ్ళుంటుంది. మారు గుడ్డ వుంటేగా ఇది ఉతుక్కుని శుభ్రంగా చేసుకోటానికి! పిల్లలంతా మగోళ్ళుకనుక సరిపోనాది. అదే ఎంకాయి, ఆడ కూతురయితే, ఈసరికి దానికీ అయిదుమూళ్ళకోక కట్టాల్సి వొచ్చును. కబుర్లకేం ఎన్నయినా చెప్పొచ్చును! చలికి గజగజలాడిపోతున్నా, కప్పుకుందికి ఒక గోనిగుడ్డన్నా దొరకదు. కడుపు ఆకలితో కిరకిర చుట్టుకుపోతున్నా, గుప్పెడు

నూకగింజలు తమలాంటోళ్ళకి, అప్పొలన్నా ఈయురు! గాంధీగారి పుట్టింరోజుట. ఆ బాబు తమలాటి పేదాసాదా కోసం బతుకు ధారపోశాడంట ! ఆ మహానుభావుడు పుట్టింరోజు పండుగపూటా తమలాంటోళ్ళకి, తలో గుడ్డముక్క పారేసినా బాగుణ్ను. ఏటో పలకలు, బలపాలు పంచత్తన్నారు. పిల్లల్ని చదివించాలట ! ముందు ఆళ్ళపొట్టలు నింప కలిగితే ఆ పయిన చదూాలూ, సోకులూ చేయొచ్చును.

"ఈ పంతుళ్ళ ఎనకాల తిరుగుతూ, అ ఆ లూ, ఇ ఈ లూ, రాయటంకంటె పశుల వెనకాల తిరిగితే నయం! పేడన్నా దొరుకుద్ది! ఇన్ని పిడకలుచేసి అమ్ముకుంటే పావలా డబ్బులు కళ్ళబడతాయి." అనుకుంది ఎల్లమ్మ.

వెంకయ్య తెచ్చిన పలకలూ, పుస్తకాలూ చూసి "ఓరి, ఇన్నేసి ఇత్తనారంట్రా !" అంది ఆశ్చర్యంగా.

"నాకు తమ్ముళ్ళకీ" అంటూ మళ్ళీ గుంపులోకి జొరబడ్డాడు. చేతినిండా పలకలతో గుంపుని అదిలిస్తున్న కార్యకర్తల కళ్ళల్లో పడ్డాడు వెంకయ్య.

"ఓరి వెధవా ! ఎన్ని పలకలు లంకించుకున్నావురా!" అంటూ వెర్రికోపంతో పిడకలాంటి అరిచేతులతో ఆ లెంపా ఈ లెంపా వాయించేశాడు.

"ఓలమ్మో ! ఓలమ్మో" అంటూ వెంకయ్య వెర్రికేక లేయసాగేడు.

ఎల్లమ్మ ఆ కేకలు వింది. గబగబా పరిగెట్టుకుంటూ వచ్చింది. "ఓర్నాయనో ఓర్నాయనో నా కొడుకుని సంపేత్తున్నార్రో మీ సేతు లడిపోనూ మీ సేతు లిరిగిపోనూ! గుంటెదవ ఓ పలక నూక్కుంటే ప్రాణాలు తీసేత్తారా! మీ బాబు సొమ్మా! మీ తాత సొమ్మా! మీ పెళ్ళాలు అరణా లట్టుకొచ్చీరా!" అంటూ గావు కేకలు వేయ సాగింది. మధ్య మధ్య గుండెలమీద బాదుకుంటూ ఏడవ సాగింది.

వాడకట్టునవున్న పెద్దాళ్ళంతా పరుగెట్టుకుంటూ వొచ్చేరు. అందరూ వెంకయ్యని కొట్టిన కార్యకర్తదే తప్ప న్నారు. మెల్లిగా చెప్పి పలకలు తీసుకోకూడదా! అన్నారు. "ఏదో చిన్నపిల్లాడు సరదాకొద్దీ ఒక పలక తీసుకుంటే ప్రాణాలు పోయేట్టు కొట్టడం చాలా తప్పు! గాంధీగారి సిద్ధాంతాలు వల్లెవేస్తూ పాటలు పాడుకుంటూ వొచ్చేరు. ఆయన పుట్టింరోజు పూటా ఒక చిన్న కుర్రాడి ప్రాణాలు తీయటానికి తయారవుతారూ! ఆమాత్రం శాంతం లేక పోతే ఇంకేం కాంగ్రెసోళ్ళు!" అంటూ దులిపేశారు.

వెంకయ్యని కొట్టిన కార్యకర్త ముఖం దమ్మిడీకానంత అయ్యింది. ముఖం దించుకుని నిలబడ్డాడు.

వెంకయ్య గురించిన రాద్ధాంతం జరుగుతూండగానే రిక్షాల్లోవున్న పలకలూ, పుస్తకాలు, ఎవళ్ళ చేతికందినవి వాళ్ళు లాగేసి రిక్షాలు ఖాళీ చేసేశారు.

అక్కడ చేరిన వాడకట్టువాళ్ళ బలవంతంవల్ల వెంకయ్యని కొట్టిన కార్యకర్త, కళ్ళనీళ్ళొరుతుండగా చేతులుజోడించి క్షమార్పణ చెప్పుకున్నాడు. నెమ్మదిగా అక్కడనించి ఆ కార్యకర్తలూ తప్పుకుని వెళ్ళిపోయేరు.

కేశవరావు ఆ కుర్చీలు, కుర్చీల్లోవున్న దేశనాయకులు ఆ ఫోటోలూ తీసి స్కూల్లోపెట్టి తలుపువేసి మళ్ళీ వేప చెట్టు దగ్గరకు వచ్చేడు. అక్కడ జరిగిన అల్లరికి చిహ్నంగా, అక్కడక్కడా చిట్లిపోయిన పలకముక్కలూ, పలక ముక్కలులేని చట్రాలూ చెల్లాచెదురుగా పడివున్నాయి.

ఎక్కడినుంచో ఎల్లమ్మ భారీగొంతు మాట్లాడు తోంది. "నాలుగు దెబ్బలు తింటేతిన్నాడులే! ఇయ్యాల లేచినేల మంచిదే అయ్యింది. పొద్దెక్కకుండా రూపాయి డబ్బులు కళ్ళచూశాము! దొమ్మీమాలో కెళ్ళాల్సినప్పుడు ఎల్లాలమరి ఆపాటి దెబ్బలకి వెరిస్తే రోజులెట్టాగెల్తాయి! ఆడు కాస్తగడి తేలేడంటే నాకు కూటికి నోటేనేదు!" అంటోంది.

కేశవరావు ఆ మాటలు వింటూ ఏదో ఆలోచిస్తూ బజారురోడ్డుకి వచ్చాడు. షావుకారు చిన్నయ్య కొడుకు, కనకయ్య, రిక్షానిండుగా పలకలూ, పుస్తకాలూ వేసుకుని రిక్షాప్రక్కన సైకిలు నడిపించుకుంటూ కనపడ్డాడు. కేశవ రావు కనకయ్యని ఎరుగును.

"ఏమిటి కనకయ్యా! పలకలూ, పుస్తకాలూ పుచ్చుకుని వెళ్తున్నావ్! మీ నాన్నకూడా, ఎక్కడయినా పంచమని ఇచ్చాడా ఏమిటి?" అని పలకరించాడు.

“ఇహిహి, ఇహీహీ” అంటూ నవ్వేడు కనకయ్య. “మాబాబుకి ఆపాటి గనకార్యం చేసే స్తోమతుందా ! ఏదో చవకగా వస్తున్నాయికదా అని కొనుక్కు వెళుతున్నాను. అయిదో తారీకున కంట్రాక్టరు రామశేషయ్యగారి ఏడో అబ్బాయికి, అక్షరాభ్యాసం చేస్తారుట ! మా వీధి మొదల లోనేగా ఆళ్ళ ఇల్లూ ! మా వీధి శివార్లలోవున్న ఎలిమెంటరీ స్కూల్లో ఏస్తారుట ఆ చిన్నాడ్ని ! ఆ మేష్ట్రి పలకలూ, ఎక్కాలబుక్కులూ, అయిదారు వందలదాకా కావాలంటేనూ, కొనుక్కు వెళ్ళుతున్నాను.” అన్నాడు కనకయ్య.

“ఎక్కడ దొరికాయి నీకు చవగ్గా!” అనుమానంతో కొట్టుకుపోతున్న మనస్సుతో అడిగాడు కేశవరావు.

“ఏటివొడ్డున హరిజనవాడలో ఇయ్యాళ పలకలూ, బలపాలూ, పంచుతారనీ, నిన్నరాత్రి పిడకలేసే ఎల్లమ్మ వచ్చి చెప్పిపోయింది. ఆళ్ళకెందుకీ పలకలు ఆళ్ళు సదూతారా, ఏంటీ ! అంతా తలో పదిపైసలకీ పలకలూ పుస్తకాలూ ఇచ్చేశారు. పదేసి పైసలకి ఒక్కో పలకా, బలపం, ఎక్కాలబుక్కు, నోటుబుక్కూ చొప్పున పడేశారు. ఆళ్ళకి పలకలేంటి, పుస్తకాలేంటి పంచటం, మతిలేని పనికాపోతే ! ఏ వేరుశనగ పప్పుండలో చేయించి అందరికీ తలోటీ పడేస్తే గాంధీగారి పేరుచెప్పుకుని తీయగా తినేవాళ్ళు గుంటెదవలు !” అంటూ నవ్వేడు కనకయ్య !

కేశవరావుకీ చిట్లిపోయి చిళ్ళపెంకు ముక్కలయి పోయిన పలకముక్కల్లో ఆ వాడలోని పిల్లలు కళ్ళముందు కదలాడేరు !

మహాత్ముడా ! నువ్వు ఒక్కసారి మళ్ళీ పుట్టి ఈ జనానికి మంచీచెడ్డా చెప్పకూడదా ! నువ్వు మళ్ళీపుట్టాలి ! అవును. గాంధీమహాత్ముడు మళ్లీ పుట్టి పెరిగితే కాని ఈ మురికి మనసుల మకిలి వదలదు." అనుకుంటూ నిట్టూర్చాడు కేశవరావు !